క్లుప్తంగా

పేదలకు వరం 'ఆరోగ్య శిబిరాలు'



జ్యోతి ప్రజ్వలన చేసి, వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పావగడ: లక్షలాది రూపాయలు వెచ్చించి చికిత్స పొందలేని పేద రోగులకు ఉచిత ఆరోగ్య శిబిరాలు వరంగా మారాయని డీసీసీ బ్యాంక్ డైరెక్టర్, సహకార రత్న టి.నరసింహయ్య అన్నారు. స్థానిక ఆంజనేయస్వామి కళ్యాణ మంటపంలో హెల్ప్ సొసైటీ, శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి శస్త్ర చికిత్స శిబిరం నిర్వహించారు. 75 మందికి వైద్యులు కంటి పరీక్షలు చేశారు. వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక మాజీ మున్సిపల్ చైర్మన్ మానం వెంకటస్వామి, విజయకుమార్, మానం శశికిరణ్, శంకర కంటి ఆస్పత్రి వైద్య నిపుణులు డాక్టర్ అశ్విని, సుమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక రుగ్మతలతో అనర్థాలు



మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

హిందూపురం అర్బన్: మానసిక రుగ్మతలు అనేక అనర్థాలకు కారణం అవుతున్నాయని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ అన్నారు. గురువారం స్థానిక జిల్లా సర్వజనాసుపత్రిలో మానసిక సమస్యలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మద్యం, సెల్‌ఫోన్‌కు సాధ్యమైనంత దూరంగా ఉండేందుకు ప్రయత్నించాలన్నారు. ఇతరులు బాగుండటం చూసి అసూయపడటం, ద్వేషం పెంచుకోవడం కూడా మానసిక రుగ్మతగా పేర్కొన్నారు. మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి ఆస్తి పంపకాల్లో సమాన హక్కులు ఉంటాయన్నారు. మానసిక రోగుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని వెల్లడించారు. అనంతరం ఏపీపీ ఇందాద్ ఆధ్వర్యంలో ఏడీజె ఆసుపత్రి పర్యవేక్షకులు రోహిత్ కుమార్, ఆర్‌ఎంఓ రుక్మిణమ్మ, డాక్టర్ రాజగోపాల్ తదితరులు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏజీపీ శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు సుదర్శన్, సుధాకర్, ఈశ్వర్, మనోహర్, ఎస్‌ఐ జయరాం, లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరంగరాజుపల్లిలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



మొక్కకు నీరు పోస్తున్న విద్యార్థులు

హిందూపురం టౌన్: స్థానిక బాలాజీ కళాశాల ఆధ్వర్యంలో పరిగి మండలం శ్రీరంగరాజుపల్లి గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు గ్రామంలో మొక్కలు నాటి, నీరు పోశారు. మొక్కల పెంపకం ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ వీరభద్రప్ప మాట్లాడుతూ.. మొక్కలే మానవ మనుగడకు జీవనాధారం అన్నారు. మొక్కల పెంపకం విద్యార్థి దశ నుంచే అలవాటు చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గోరంట్ల ఎస్‌బీవీఎం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భక్తవత్సలం, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ అంజలి, ప్రియాంక, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తక్షణసాయం అందజేత

హిందూపురం: పట్టణంలోని 32వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్‌ఎండీ ఖలీల్ అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా పథకం కింద మృతుడి భార్య ఎస్.షాహినాకు గురువారం రూ.10 వేల తక్షణసాయం అందజేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ షేక్ రేష్మాబాను, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబు, కన్వీనర్ ఫరూక్, వెల్ఫేర్ సెక్రటరీ రాజు, క్లస్టర్ వలంటీర్ ప్రకాష్ పాల్గొన్నారు.

కరావులీశ్వర దేవాలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

గోరంట్ల: మండల పరిధిలోని కరావులపల్లి గ్రామంలో గ్రామస్తులు, దాతల సహకారంతో నూతనంగా నిర్మించ తలపెట్టిన కరావులీశ్వర దేవాలయానికి గురువారం పలువురు విరాళాలు అందజేశారు. కరావులపల్లికి చెందిన రేపటి వెంకటశివారెడ్డి కుమారుడు ప్రశాంత్‌రెడ్డి రూ.20,116, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి రూ.10 వేలు, ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ డీలర్ సూర్యనారాయణ రూ.15 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రేపటి రామచంద్రారెడ్డి, చింతా రామకృష్ణారెడ్డి మేకల రంగప్ప, లక్ష్మీరెడ్డి, రేపటి కృష్ణారెడ్డి, గొల్ల శ్రీరాములు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత

● మంత్రి ఉషశ్రీచరణ్



తుంగోడులో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

సోమందేపల్లి: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రభుత్వం సమ ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ స్పష్టం చేశారు. గురువారం మండలంలోని తుంగోడు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. గాంధీజీ కలలకు అనుగుణంగా గ్రామ స్వరాజ్యం దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని వర్గాల ప్రజలకు పథకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇది చూసి ఓర్వలేని స్థితిలో ప్రతిపక్షాలు ఉన్నాయని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ రామకృష్ణా రెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, సంగీత, నృత్య అకాడమీ డైరెక్టర్ సువర్ణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, సర్పంచులు గంగమ్మ, నిర్మల, రామాంజి, జిలాన్ ఖాన్, పరంధామ, ఎంపీటీసీలు సరస్వతమ్మ, ఈశ్వరయ్య, నాగప్ప, సింగిల్ విండో చైర్మన్ కొల్లప్ప, కో-ఆప్షన్ సభ్యుడు రఫీక్, సీనియర్ నాయకులు లక్ష్మీనరసప్ప, సుధాకర్ రెడ్డి, ఎల్లారెడ్డి, నరేంద్ర, ప్రసాద్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, ఎల్లారెడ్డి, నరేంద్ర, ప్రతాప్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి ఆదెప్ప, సచివాలయ కన్వీనర్ సూర్యనారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి ఆర్డీటీ సహకారం



మాట్లాడుతున్న విశాలా ఫెర్రర్

గుడిబండ: మహిళాభ్యున్నతికి ఆర్డీటీ సహకారం అందిస్తుందని ఆ సంస్థ మహిళా సాధికారత డైరెక్టర్ విశాలా ఫెర్రర్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో ఒంటరి మహిళలతో సమావేశం నిర్వహించారు. ఆర్డీటీ సంస్థ ద్వారా గ్రామాల్లో నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అండగా నిలుస్తున్నట్లు రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఏరియా టీం లీడర్ సావిత్రి సూచించారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిన నాయకులు



హిందూపురం: జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న సమన్వయకర్త టిఎన్.దీపిక



సోమందేపల్లి: విజయవాడకు బయలుదేరిన పార్టీ నాయకులు, దళిత సంఘాల నాయకులు

హిందూపురం/సోమందేపల్లి/లేపాక్షి/పరిగి/గుడిబండ/అగళి/రొళ్ల: విజయవాడలోని అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల నుంచి ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, దళిత సంఘాల నాయకులు గురువారం పెద్ద ఎత్తున తరలివెళ్లారు. హిందూపురంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, నాయకుడు వేణు రెడ్డి జెండా ఊపి 5 బస్సులను ప్రారంభించారు. ప్రభుత్వం 206 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. సోమందేపల్లిలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఈఓఆర్డీ నాగరాజురావు జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహ మూర్తి, కంబాలప్ప, ఈశ్వర్, బాలాజీ మూల గోవిందప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. లేపాక్షి నుంచి విజయవాడకు బయలుదేరిన బస్సును వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదినారాయణ, ఎంపీడీఓ నరసింహనాయుడు, నాయకులు నారాయణప్ప, నాగరాజు, సురేష్, బోర్ల అంజినరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పరిగి మండలం నుంచి 42 మంది సామాజిక సమతా మహా సంకల్ప సభకు బస్సులో వెళ్లినట్లు ఎంపీడీఓ సరస్వతి, మండల ప్రత్యేకాధికారి ప్రసాద్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శ్రీధర్, సెక్రెటరీలు అరుణ, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు. అగళిలో సర్పంచ్ శివకుమార్ ఆధ్వర్యంలో దళిత సంఘం నాయకులు విజయవాడకు తరలివెళ్లారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు కాంతరాజు, హనుమంతరాయప్ప పాల్గొన్నారు. రొళ్ల మండల కేంద్రం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, దళిత సంఘం నాయకులు గురువారం సాయంత్రం ప్రత్యేక ఆర్టీసీ బస్సులో విజయవాడ తరలివెళ్లారు. ఎంపీడీఓ ఆజాద్, ఈఓఆర్డీ క్రిష్టప్ప జెండా ఊపి బస్సును ప్రారంభించారు.కార్యక్రమంలో మడకశిర మార్కెట్ యార్డు చైర్మన్ జయరామప్ప, డైరెక్టర్ శ్రీనివాస్, దళిత సోదరులు, నాయకుడు మహంతేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

రొళ్ల: అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి వలంటీర్ల సహాయంతో నేరుగా ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందన్నారు. అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు. అనంతరం శాఖల వారీగా అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. సర్వసభ్య సమావేశానికి విద్యుత్‌శాఖ అధికారులు గైర్హాజరు కావడంతో ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్‌శాఖ అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. గత మూడు నాలుగు నెలలుగా గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని తెలియజేసిన పట్టించుకోవడం లేదని వాపోయారు. ఉద్యాన, అటవీశాఖతో పాటు మరికొన్ని శాఖల అధికారులు సర్వసభ్య సమావేశానికి డుమ్మా కొట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నాగరాజు, ఎంపీడీఓ ఆజాద్, డీటీ భాగ్యలక్ష్మి, ఎంఈఓ శ్రీధర్, ఏపీఎం నాగరాజు, ఏపీఓ ఓబుళప్ప, ఈఓఆర్డీ క్రిష్టప్ప, ఏఓ రాజ్యలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సన్నమ్మ, హౌసింగ్ ఏఈ మాసప్ప, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ డీలర్ మృతి



నివాళులర్పిస్తున్న నాయకులు

అమరాపురం: మండల పరిధిలోని ఆరోన పల్లి గ్రామానికి చెందిన మాజీ డీలర్ ఈరనాగప్ప (82) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మడకశిర నియోజకవర్గం వక్కలిగ సంఘం అధ్యక్షుడు, రొళ్ల జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈరనాగప్ప మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అలాగే వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఉగ్రప్ప, ఆలదపల్లి సర్పంచ్ గిరిజమ్మ తదితరులు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మాజీ డీలర్ ఈరనాగప్పకు భార్య, కుమారులు ఉన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పావగడ: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని అర్బన్ సీఐ సురేశ్ సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లైసెన్స్ లేనివారు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని తెలిపారు. నియమ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని సూచించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లింగరాజు, ఎస్‌ఐ గురునాథ్,తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం ప్యాకెట్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం ప్యాకెట్లను చూపుతున్న పోలీసులు

మడకశిరరూరల్: గుడిబండ మండలం జంబులబండ గ్రామ సమీపంలో అక్రమంగా విక్రయిస్తున్న 500 కర్ణాటక టెట్రా మద్యం ప్యాకెట్లను గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సెబ్ సీఐ భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ.. అక్రమంగా మద్యం ప్యాకెట్లు విక్రయిస్తున్న కర్ణాటకలోని కొత్తూరు గ్రామానికి చెందిన వీరాంజనేయులను అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు. సదరు వ్యక్తి కర్ణాటక మద్యం ప్యాకెట్లను తీసుకొచ్చి జంబులబండ సమీపంలో విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. అక్రమంగా మద్యం విక్రయించకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. గ్రామాల్లో కర్ణాటక మద్యం ప్యాకెట్లను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

అగళి: మండల పరిధిలోని దొక్కలపల్లి గొల్లహట్టి గ్రామానికి చెందిన గోవిందప్ప అనే వ్యక్తి గురువారం కర్ణాటక మద్యం తరలిస్తుండగా అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ లావణ్య తెలిపారు. అతడి నుంచి 15 రాజా విస్కీ పాకెట్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సమష్టి కృషితో గ్రామాల అభివృద్ధి



అమరాపురంలో సూచనలిస్తున్న ఎంపీడీఓ మునిస్వామి



చిలమత్తూరు: సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్న ఎంపీడీఓ నరేష్ కృష్ణ

అగళి: గ్రామాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని ఎంపీడీఓ రవిప్రసాద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)పై సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న అభివృద్ధి పనులు, పనులకు అయ్యే ఖర్చు తదితర వివరాలతో నివేదికలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనివాసరావు, ఈఓఆర్డీ పద్మ, కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అమరాపురం: జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలతో పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)పై శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. గురువారం వెలుగు, ఎంపీడీఓ కార్యాలయాల్లో 11 పంచాయతీల పరిధిలోని ప్రజా ప్రతినిధులు, అధికారులకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)పై శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, ఈఓఆర్డీ మాట్లాడుతూ.. ప్రస్తుతం 2024–25 సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో ఏయే పనులు అవసరం, ఉపాధి హామీ పథకంలో చేపట్టనున్న పనులపై ఆరా తీశారు. ఈ సంవత్సరంలో చేపట్టబోయే పనులకు ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. ఇందుకు అయ్యే అంచనా మొత్తం తదితర వాటిని ఏ విధంగా సిద్ధం చేయాలో వివరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ గ్రాంటుల వినియోగం, స్థానికంగా పన్ను వసూలు, తదితర వాటిపై అవగాహన కల్పించారు.

చిలమత్తూరు: మండలంలోని పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించేందుకు గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రధానంగా తొమ్మిది అంశాలపై ఎంపీడీఓ నరేష్‌కృష్ణ అవగాహన కల్పించారు. పేదరికం లేని మెరుగైన జీవనోపాధులు కలిగిన గ్రామం, మెరుగైన విద్య, వైద్యం, నీటి సౌకర్యం, మౌలిక వసతులు, సామాజిక న్యాయం, భద్రత, మహిళాభివృద్ధి తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

గుడిబండ: మండల పరిధిలోని చిగతుర్పి గ్రామ పరిధిలోని నాగేపల్లి సచివాలయ ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓఓ రామారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది హాజరుకావాలని సూచించారు.

నేడు యోగి వేమన జయంతి

మడకశిరరూరల్: పట్టణంలోని ఆదిరెడ్డి పాళ్యంలో శుక్రవారం విశ్వకవి యోగి వేమన జయంతి నిర్వహిస్తున్నట్లు రెడ్డి సంఘం నాయకులు తెలిపారు. గురువారం మండలంలోని గ్రామాల్లో పర్యటించి వేమన జయంతికి రావాలని రెడ్డి కులస్తులను ఆహ్వానించారు.

పెనుకొండలో విగ్రహ ప్రతిష్ట

పెనుకొండ: పట్టణంలోని పోస్టాఫీస్ సర్కిల్‌లో శుక్రవారం యోగి వేమన విగ్రహాన్ని ప్రతిష్టించనున్నట్లు రెడ్డి సంఘం నాయకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక జూనియర్ కళాశాల నుంచి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ర్యాలీగా పోస్టాఫీస్ సర్కిల్ వద్దకు చేరుకుంటామని వెల్లడించారు.

21న వేమన చిత్రపటం ఊరేగింపు

హిందూపురం టౌన్: యోగి వేమన జయంతిని పురస్కరించుకుని ఈనెల 21వ తేదీన త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, రెడ్డి జేఏసీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో వేమన చిత్రపటాన్ని ఊరేగించనున్నారు. మేళాపురం సర్కిల్ వద్ద తెలుగుతల్లి విగ్రహం నుంచి బసనపల్లి వేమన సర్కిల్ వరకూ ఊరేగింపు ఉంటుందని రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

చిలమత్తూరు: మండలంలోని మొరంపల్లి సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని సోమఘట్ట పంచాయతీ ఎస్.కొత్తపల్లి గ్రామానికి చెందిన నాగరాజు అనే వ్యక్తి గురువారం ఉదయం ద్విచక్ర వాహనంలో వెళ్తూ బైక్ అదుపు తప్పడంతో కిందపడ్డాడు. ఈ ఘటనలో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన క్షతగాత్రుడిని హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కొనసాగుతున్న క్రీడా పోటీలు



గుడిబండ: టాస్ వేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

గుడిబండ: మండల పరిధిలోని మద్దనకుంట క్రీడా మైదానంలో గురువారం మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఎంపీడీఓ రామారావు ప్రారంభించారు. క్రికెట్‌లో దేవరహట్టి, గుడిబండ జట్లు తలపడగా.. దేవరహట్టి విజేతగా నిలిచింది. విజేత జట్టును ఎంపీపీ రాధమ్మ అభినందించారు. కార్యక్రమంలో ఏఓ నారాయణప్ప పీఈటీలు సాయికృష్ణ, కొండప్ప సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహించారు. క్రికెట్‌లో గౌనివారిపల్లి, మల్లాపల్లి సచివాలయాల జట్లు తలపడ్డాయి. గౌనివారిపల్లి జట్టు విజయం సాధించి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైంది. వాలీబాల్ పోటీల్లో గోరంట్ల 2వ సచివాలయ టీమ్ విజేతగా నిలిచింది. కబడ్డీలో గోరంట్ల–1 సచివాలయ టీమ్ విజేతగా నిలిచింది. ఈనెల 24వ తేదీన పెనుకొండలో నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గోపాల్, నియోజకవర్గ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ రామ్మోహన్, పీఈటీలు కృష్ణారెడ్డి రజినికుమార్, రామచంద్రనాయక్, రవినాయక్, భాషా, మనోహర్, సూర్యనారాయణమ్మ, యమున పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం

గోరంట్ల: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పని చేయాలని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్లు సందీప్, దిలీప్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక రంగమహాల్ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గంలోని అన్ని మండలాల సోషల్ మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వారు సూచించారు. ఈనెల 20వ తేదీన మరోసారి పెనుకొండ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో మరోసారి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో భూగర్భ జలాల వృద్ధి

చిలమత్తూరు: చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని సెహగల్ ఫౌండేషన్ ట్రస్టీ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారిణి అంజలీ మఖిజా అన్నారు. గురువారం మండలంలోని సుబ్బరావుపేట, మదిరేపల్లి గ్రామాల సమీపంలో చిత్రావతి నదిపై నిర్మించిన చెక్‌డ్యామ్‌లను పరిశీలించారు. ఫౌండేషన్ ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలో చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలు, పాఠశాలల ఆధునీకీకరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇందుకు కోకో కోలా కంపెనీ సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యుడు సత్యనారాయణ, సర్పంచ్ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన

రొద్దం: మండల పరిధిలోని తాడంగిపపల్లి గ్రామ పంచాయతీలో గురువారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను అధికారులు ప్రజలకు వివరించారు. ఉజ్వల పథకం ద్వారా లబ్ధిపొందుతున్న వారికి స్లిప్పులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మహాలక్ష్మి, ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, ఏపీఓ రషీద్, బీజేపీ మండల అధ్యక్షుడు నీరుగంటి వేణుగోపాల్, వైద్య, విద్య, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

శాంతియాత్ర



ర్యాలీ నిర్వహిస్తున్న బ్రహ్మకుమారీలు

హిందూపురం: పట్టణంలోని సేవా కేంద్రం వద్ద నుంచి గురువారం బ్రహ్మకుమారీలు పురవీధుల్లో శాంతి యాత్ర చేపట్టారు. ప్రజాపిత వ్యవస్థాపకులు ప్రజాపిత బ్రహ్మ సంపూర్ణ దివ్యత్వాన్ని పొంది అవ్యాత్తాన్ని పొందిన దినంగా పాటిస్తారు. దివ్యత, పవిత్రత, శాంతి, సంతోషం సర్వ గుణాలను సిద్ధింప చేసుకున్న దినంగా శాంతి స్తంభం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బ్రహ్మ కుమారి కమల పాల్గొన్నారు.

హెచ్‌ఆర్ పాళ్యంలో శ్రమదానం

మడకశిరరూరల్: విద్యార్థులు విద్యతో పాటు సేవా కార్యక్రమాలను చేపట్టి గ్రామాభివృద్ధికి సహకారం అందించాలని ఎంపీపీ కవిత తెలిపారు. గురువారం హెచ్‌ఆర్ పాళ్యం గ్రామంలో వెంకటేశ్వర జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు శ్రమదానం చేపట్టారు. వీధులను శుభ్రం చేసి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. విద్యార్థులు సమాజ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేసి ప్రతి ఇంటికీ లబ్ధి చేకూర్చిందన్నారు. విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం సహకారం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ చైర్మన్ నారాయణ రెడ్డి, పీఓలు రఘు, గోపీకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని వినతి

మడకశిరరూరల్: మండల పరిధిలోని గుడ్డంపల్లి గ్రామంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్మించనున్న కమ్యూనిటీ భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని గ్రామస్తులు కోరారు. గురువారం డిప్యూటీ తహసీల్దార్ బాలాంజనేయులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. గ్రామంలోని పిల్లలను ఆర్డీటీ దత్తత తీసుకున్నట్లు తెలిపారు. పిల్లలకు చదువు చెప్పించడానికి భవనం లేదన్నారు. రెవెన్యూ అధికారులు పరిశీలించి భవన నిర్మాణానికి అవసరమగు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలన్నారు.